# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 16-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు దేశాల పర్యటనలో భాగంగా జోర్డాన్ పర్యటనను ముగించుకుని ఈరోజు సాయంత్రం ఇథియోపియా చేరుకున్నారు.
- ❖ సబ్‌కా బీమా.. సబ్‌కి రక్ష (బీమా చట్టాల సవరణ) బిల్లు - 2025ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు.
- ❖ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన లేబర్ కోడ్స్ కార్మికుల జీవితాల్లో సానుకూల మార్పును తీసుకురానున్నాయని కేంద్రమంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ చెప్పారు.
- ❖ గ్రామీణ కుంటుంబాలకు చట్టపరమైన ఉపాధి హామీ కల్పించే లక్ష్యంతో వీబీజి రామ్ జి బిల్లును తీసుకువచ్చామని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడు దేశాల పర్యటనలో భాగంగా జోర్డాన్ పర్యటనను ముగించుకుని ఈరోజు సాయంత్రం ఇథియోపియా చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా భారత్-ఇథియోపియా ద్వైపాక్షిక సంబంధాలపై ఆ దేశ ప్రధాని డాక్టర్ అబియ్ అహ్మద్ అలీతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ విస్తృత చర్చలు జరుపుతారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇథియోపియాకు జరుపుతున్న తొలి పర్యటన కాగా రేపు ఇథియోపియా పార్లమెంట్ సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. అనంతరం ఇథియోపియా పర్యటనను ముగించుకొని ప్రధానమంత్రి ఒమన్ వెళ్తారు.

====================

సబ్‌కా బీమా.. సబ్‌కి రక్ష (బీమా చట్టాల సవరణ) బిల్లు -2025ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బీమా చట్టం 1938, జీవిత బీమా కార్పొరేషన్ చట్టం 1956, బీమా నియంత్రణ, అభివృద్ధి అథారిటీ చట్టం-1999లను సవరిస్తూ.. దీనిని రూపొందించారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... ఈ బిల్లు మెరుగైన నియంత్రణ పర్యవేక్షణ, సమ్మతి సౌలభ్యం, బీమా మధ్యవర్తుల ద్వారా

అంతరాయం లేని సేవలను అందిస్తుందన్నారు. పారదర్శకతను తీసుకురావడం, ఎఫ్‌డిఐని పెంచడం, సమ్మతి సంబంధిత సమస్యలను పరిష్కరించడం ఈ బిల్లు లక్ష్యమని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

చర్చ అనంతరం ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన కార్మిక కోడ్స్ కార్మికుల జీవితాల్లో సానుకూల మార్పును తీసుకురానున్నాయని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన కార్మిక, ఉపాధి సదస్సు -2025లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... నూతన సంస్కరణలు కాంట్రాక్టు కార్మికులను ఉద్యోగ భవిష్య నిధి నుండి మినహాయించలేదని, వారికి సామాజిక భద్రతను కల్పిస్తాయని పేర్కొన్నారు. మహిళలు రాత్రి సమయంలో అన్ని సంస్థలలో అన్ని రకాల పనులు చేయడానికి ఇవి అవకాశాన్ని కల్పించడంతో పాటు, సమాన వేతనాలకు మద్దతు ఇస్తాయన్నారు. ప్రమాదకర పరిశ్రమల కార్మికులకు వార్షిక ఆరోగ్య పరీక్షలు ఉచితంగా అందిస్తామని మన్సుఖ్ మాండవీయ వివరిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ - రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) వీబీ-జి రామ్ జి బిల్లు 2025 ను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లోక్‌సభలో ఈరోజు ప్రవేశపెట్టారు. ఇరవై ఏళ్ల నాటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం- 2005 (MGNREGA) స్థానంలో ఈ బిల్లును తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... వికసిత్ గ్రామ పంచాయితీ ప్రణాళికల ద్వారా వాటి అభివృద్ధికి స్వీయ మార్గాన్ని ఏర్పరుచుకునే అధికారాన్ని గ్రామ సభలు, పంచాయితీలకు ఈ బిల్లు కల్పిస్తుందన్నారు. ఈ నూతన బిల్లు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధికి చట్టపరమైన హామీ లభిస్తుందని, అలాగే జీవనోపాధి అవకాశాలు పెరుగుతాయని, గ్రామీణ అభివృద్ధి పనులు వేగవంతమవుతాయన్నారు. గతంలో ఉపాధి హామీ పథకం కింద 100 రోజులుగా ఉన్న పని దినాలు ఇకపై 125 రోజులకు పెరగనున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు గ్రామీణ కుంటుంబాలకు సాధికారత కల్పించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశ్యమని శివరాజ్ సింగ్ చౌహాన్ వివరిస్తూ...

(వాయిస్ 18 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద ఇప్పటివరకు మొత్తం 7 లక్షల 86 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారుల నిర్మించడం జరిగిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ అన్నారు. లోక్‌సభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.... గ్రామీణ రహదారుల నిర్మాణానికి 3 లక్షల 46 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని తెలిపారు. నాణ్యత నియంత్రణ యంత్రాంగం ద్వారా గ్రామీణ రోడ్ల పర్యవేక్షణ జరుగుతోందన్నారు. ఈ గ్రామీణ రోడ్ల నిర్వహణ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాల బాధ్యత అని కమలేష్ పాశ్వాన్ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ భారతదేశం గత 7 నెలల్లో సముద్ర రంగంలో దాదాపు 20 శాతం వృద్ధిని నమోదు చేసిందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాలకు సమాధానంగా కేంద్రమంత్రి ఈరోజు మాట్లాడుతూ... భారత్ కు చెందిన చేపల ఎగుమతి సంస్థలపై కొన్ని దేశాలు యాంటీ-డంపింగ్ సుంకాలు విధించినప్పటికీ ఈ వృద్ధి సాధించామన్నారు. చేపల ఎగుమతిని గరిష్ట వృద్ధికి విస్తరించడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం ఇటీవల 25 వేల కోట్ల రూపాయల వ్యయంతో `నిర్యత్ దిశ పథకా`న్ని ప్రారంభించిందని, ఇది ఎగుమతిలో పోటీతత్వాన్ని పెంచడంతో పాటు, ఆర్థికేతర మద్దతుపై దృష్టి పెడుతుందని పీయూష్ గోయల్ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నియంత్రించడానికి ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో పలు ప్రయత్నాలు చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు. లోక్‌సభలో ఈరోజు ఒక ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిస్తూ... మాదకద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల అక్రమ రవాణాను ఎదుర్కోవడానికి భారతదేశం 27 దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలు, 19 దేశాలతో అవగాహన ఒప్పందంపై సంతకం చేసిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణాను ఎదుర్కోవడానికి నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో బ్రిక్స్, ఆసియాన్, బిమ్‌స్టెక్, ఎస్‌సిఓ వంటి వివిధ అంతర్జాతీయ సంస్థలతో సమన్వయం చేసుకుంటుందని నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్‌లోని యమునా ఎక్స్ ప్రెస్ రహదారిపై జరిగిన ప్రమాదం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరణించిన వారికి సంతాపాన్ని తెలియచేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి ఒక్కొక్కరికి 2 లక్షల రూపాయల చొప్పున ఎక్స్ గ్రేషియాను ప్రకటించారు. గాయపడిన వారికి 50 వేల రూపాయలు చొప్పున ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈరోజు యమునా ఎక్స్‌ప్రెస్ రహదారిపై పొగమంచు కారణంగా పలు వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో భారీగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 13 మంది మరణించగా, 75 మందికిపైగా గాయపడ్డారని అధికారులు తెలియజేశారు. యమునా ఎక్స్ ప్రెస్ వే మార్గంలోని ఆగ్రా - నోయిడా క్యారేజ్ రహదారిపై ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 85 వేల 213 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 533 పాయింట్లు నష్టపోయి 84 వేల 679 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 167 పాయింట్ల నష్టంతో 25 వేల 860 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 91 రూపాయల 04 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 59.53 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 280 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =